'గప్ చుప్'

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

స్త్రీ, అయినా స్త్రీ ఒక అనుభవం. ఒక సుఖం. రహస్యానుభావం ఏదయినా అనుభవించాక ఆ అవసరం తీరిపోతుంది. మనం అరటి పండును కాని బత్తాయిని కాని ఒలుచుకుని తిన్నాక తొక్కలు విసిరి పారేస్తాం. అయ్యో ఒలుచుకు తిన్నామని తొక్కల్ను ప్రేమిస్తామా?

అదో పెద్ద పిరమిడ్‌లాటి ఆసుపత్రి. అక్కడ ముల్లు గుచ్చుకుందని వెళ్తే పది ఎక్సరేలు యూరిన్ బ్లడ్ టెస్టులు యింకా యీటెస్టులు ఆటెస్టులు చేసి దోచేస్తారు. పూర్వం డాక్టర్లు యింటింటికీ విజిట్టుకి వచ్చి వైద్యాలు చేసి బిల్లు చేసేవారు. ఇప్పుడు రోగులు ఆసుపత్రుల దగ్గరకు వెళ్తున్నారు. అక్కడ సకల సదుపాయాలు భోగాలు కొనుక్కుంటున్నారు. డాక్టర్లు ఒక విధమైన సంఘ సేవకులుగా వుండి మర్యాదగా జీవిస్తున్నారు. పెద్ద పెద్ద ఆసుపత్రులు వెలిసి డాక్టర్ల సేవలను ఉద్యోగులనుంచి పనిని రాబట్టినట్లు కొనుక్కుంటున్నారు. ఇప్పుడు ఒక ఆసుపత్రిని ఒక కర్మాగారంలా నడపవచ్చు. యజమానికి డబ్బు నిర్వహణ శక్తి వుంటే డాక్టర్లను నియమించి ఆసుపత్రులను జాయింట్ స్టాక్ కంపెనీలవలె కార్పొరేటు బాడీలుగా నడపవచ్చు.

అటువంటి ఓ హాస్పత్రి ఊరికంతా గర్వకారణంలా కొండమీద నిలుచుంది. ఆ ఆసుపత్రికి ఒక ఇంగ్లీసు యోధుడి పేరు పెట్టారు. ఎవరైనా జబ్బుపడి ఆ ఆసుపత్రిలో చేరడం వారి జాతకంలో చేసుకున్న పుణ్యంగా భావించవచ్చు. ఆ ఆస్పత్రి ముందుకార్లు కుక్కల్లా పడి వుంటాయి. మునుపట్లా ఒక్క డాక్టర్ అనేక వ్యాధుల్ని నయం చేయ్యడంగాక, అనేకమంది నిపుణులు ఒక రోగిని పరీక్షించి వానిని కడతేర్చవచ్చు. మళ్ళీ యీ నిపుణులైన డాక్టర్ల సాంస్కృతికమైన అభిరుచులు చాలా తక్కువ స్థాయిలో వుండటం గమనార్హం. రౌడీరాజా, పోకిరిమొగుడు, దొంగపెళ్ళాం యిటువంటి సినిమాలు చూస్తారు. ఆసినిమాల్లోని పాటలు వింటారు. రికార్డు డాన్సులు చూసి ఎంజాయి చేసే స్థాయిలో వుంటారు.

ఆ ఆస్పత్రికి గేట్ వే వుంది. ముందు వినాయకుని దేవాలయం వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర్లో వున్నాయి. దారి పొడవునా యూనిఫారాలు ధరించిన సెంట్రీలు వున్నారు. సెంట్రీలకు మిలటరీ పద్ధతిలో పారేడులు జరుగుతూ వుంటాయి.

ఎవరైనా కేరియర్లు, పేషంట్లకు పళ్ళు పుచ్చుకు ఆసుపత్రిలోనికి జొరబడితే యీసెంట్రీలు వాళ్ళని అటకాయించి అల్లరి పెడతారు. ఈపళ్లు, ఆహారం తీసుకెళ్ళడానికి డాక్టర్ల పరిమిట్లు వుండాలి. అర్థమైన గడ్డీ మీరు పేషంట్లకు తినిపించడానికి వీల్లేదు అని రుకాయిస్తారు. విజిటర్లుని అల్లరిపెట్టడం వీరివంతు. 'వృధావ్యార్థ భంగము కానించెడు వారలెవ్వరూ ఎరుంగన్ శక్యమ్, ఏరికల్, అన్నది వీరి పట్ల నిజం. తాళ్ళ పన్ను కల్లు తాగే వాడే కడతాడన్నట్లు అన్ని ఫీజులు రోగం వున్న వాడే భరిస్తాడు అని సరిపెట్టుకోవాలి. బయట చవగ్గా లభించేవన్నీ యీ ఆవరణలో బహుప్రియం. ఏజబ్బయినా బాధపెట్టేదే కానిసుఖమైన రోగాలు వుండవుకదా! బాధల నుంచి డబ్బు లాగడమే విద్య. రోగాలు తగ్గినా తగ్గకపోయినా డాక్టర్ల జేబులు బరువెక్కడం ఖాయం.

అలాటి చోట ఒక రోగి అతనితో కొంతమంది బంధువుల ముతాచేరారు. ఆబంధువులూ పల్లెటూరివాళ్ళు. ఆరోగి ఆబాపతే. పల్లెటూరి వాళ్ళయినా ఒకరిద్దరు అపురూప సౌందర్యవతులున్నారు. అందంగా వుండటం అపరాధంకాదుగదా. ఎథింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ జాయ్ ఫర్ ఎవ్వర్ అన్నాడు ఓకవి, అదిశాపం అని ఎక్కడాచెప్పలా. జాయ్ ఫర్ ఆల్‌కాదు.

కామార్తాహి ప్రకృతి కృప శాశ్వతూచేతన్‌గు అన్నాడు కవి. ఒక అమ్మాయి చీకటిపడ్డాక కేరియర్ పుచ్చుకుని వస్తోంది రోగి కోసం. ఆ సెంట్రీ యీ అమ్మాయిని నీకు పర్మిటు వుందా, యీ అన్నం తీసుకెళ్ళి పేషంటుకు పెట్టడానికి అడిగాడు. ఆ అమ్మాయి వాడి కళ్ళతో బిత్తరపోయి చూసింది. మరో సెంట్రీ కూడా బీషణంగా ముదురు మీసాల్తో, వురిమే గుడ్లతో ప్రశ్నించాడు. లేదు లేదు ఆ అమ్మాయి పోనివ్వమని బ్రతిమాలింది. అప్పుడా గేటు రక్షకుడు ఆ అమ్మాయిని లోపలికి తీసుకెళ్తానని తనవెంట రమ్మని ఆ దుర్గమారణ్యపు చిక్కుదారులలోకి తీసుకెళ్ళాడు. మరో ముగ్గురు ఆస్పత్రి రక్షకభటులు ఫాలో అయ్యారు. వారంతా కీచకుడి కజిన్సులా వున్నారు. ఆ అమ్మాయి నమ్మి వారిని ఫాలో అయింది. ఆసుపత్రికి ఎక్స్‌టెన్షన్ వార్డు కడుతున్నారు. ఆ గుహలాటి చోటుకి ఆ అమ్మాయిని యీడ్చుకెళ్ళారు. ముగ్గురిలో కామం పడగవిప్పి ఆ సుందరిని కాటు వేసింది. ఏడ్చింది. గోలచేసింది. ఇటూఅటూ పరుగెత్తడానికి ప్రయత్నం చేసింది. వేటకుక్కలు మృగాన్ని తరిమి తరిమి చీల్చుకు తిన్నట్లు ముగ్గురు ఆస్థానరవుడీలు ఆమెను ఆరగించారు.

బలహీనంగా శవంలా వున్న ఆడది - ముగ్గురు నలుగురు కలిసి అనుభవించిన పదార్థం యికమిగలకూడదు? అది వుంటే మహాప్రమాదం. ముగ్గురూ కలిసి ఆమెను దారుణంగా పీక పిసికి చంపేశారు. ఆహా పిస్తోలు పేల్చి చంపేశారు నిజంగా ఎంతకరుణాసముద్రులు?

తమని వంతులవారీగా సుఖపెట్టిన శవాన్ని వదిలించుకోవడం ఎలా? వెంటనే ఆ ఆస్పత్రి కాపలా వీరులు ఆ బాలిక శవాన్ని ఆస్పత్రిభవనం మీదకు తీసికెళ్ళి క్రిందకు విడిచేశారు. పైకెళ్ళి ఆ అందమైన ఆడపిల్ల క్రిందకు దూకి మరణించిందని జనం అనుకుని తృప్తిపడాలని.

అసలు ఆసుపత్రి యాజమాన్యానికి మర్నాడో పెద్ద అగ్ని పరీక్ష. మీద నుంచి క్రిందపడి మరణించిన పేషంటు తాలూకు చుట్టం దేహాన్ని ఆత్మహత్య అని నిర్ధారణచేసి, ఆమె తాలూకు పేషంటును కూడా అర్జంటుగా ఏడవకుండా పడి గోలచేయకుండా తరిమేశారు. ఒక పేషంటుని చేర్చుకోడానికీ, చేర్చుకోకపోడానికీ, తరిమివేయడానికీ అన్ని హక్కులూ ఆస్పత్రి యాజమాన్యానికే వున్నాయి. సరి!సరి!

ఈ అత్యాచారం గురించి జనానికి ముఖ్యంగా ప్రెస్సు వారికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఆ నరమాంస భక్షకుల్ని ఉద్యోగం నుంచి తీసివేసి వెనక్కి చూడకుండా పొమ్మన్నారు. రయిటెబవుట్ టర్నీ, పీఛేముడ్!

ఇంగ్లీషులో హగ్‌అప్ చేయడం అని అంటారు. ఆ అందమైన సామాన్య స్త్రీ గురించి కన్నీటి బొట్టు విడవడానికి వీలులేకుండా యావత్తు ఆస్పత్రి యాజమాన్యం ఏమీ జరగనట్లే నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఇది తెలిస్తే ఆస్పత్రి కెవరూ రారు. వైద్యం చేయించుకోరు. ఆస్పత్రి వ్యాపారం నిలచిపోతుంది. అంచేత గప్‌చుప్! *